# జైలు డైరీ

★

పొట్లపల్లి రామారావు

జైలుకు చేరుకునేసరికి చాలా రాత్రి అయింది. వేకువజామున జైలు సెంట్రీ టంగున గంట ప్రమోగించేసరికి మేమంతా ఉలికిపడి దిక్కులు చూచాము. అప్పటికప్పుడే ఖైదీలు పనులకు పోతున్నారు.

జీవితాంతం వరకూ ఏ విధమైన ఆకర్షణ నూతనత్వము లేని ఆ ఎడారి మధ్య జీవితాలు ఎట్లా గడుపుతారో ఆ జన్మ ఖైదీలు! పెళ్లాం, పిల్లల నుండి ప్రాపంచిక సుఖాలనుండి విడదీయబడిన జీవులు ఏమి చూచుకొని తమ ఎడబాటును మరచిపోతారూ! ఇంతలో భుజముపైన ఓ షిల్లిని ఎక్కించుకొని ఓ ముసలి వార్డరు మావైపు వచ్చాడు.

"ఏమి తాత?" అన్నాం అందరం.

"రాత్రి వచ్చింది మీరేనా?"

"ఔను తాత."

"మీవాళ్ళు చాలామంది ఉన్నారు, దిగండి."

"మీరు మావాళ్ళే తాత"

"ఎందుకా తాము—మీరు ఎవరో తెలియదనుకున్నారా?"

"మేమూ మనుషులమే తాత"

"అయితే ఏమీ గీత"

నొష్ట వేలుపెట్టి మా నుదుట ఏవో ప్రత్యేకమైన గీతలు గీయబడ్డట్టు నిట్టూర్పు తీసాడు ఆ ముదుసలి. మేమంతా జాలిగా నవ్వుతూ అతని వెనుక నడిచాము.

గేటువద్ద కాపలాఉన్న జవాను మేమేమైనా, ప్రేలుడు పదార్థాలు, మత్తు పదార్థాలు, ఈలాంటివేయింకా ఏమైనా నిషిద్ధ వస్తువులు తీసుకువస్తున్నామేమోనని, మా శరీరాలు గాలించి చూచాడు. ఎవరి దగ్గరా, ఏవో కొన్ని చిల్లర డబ్బులు, కలాలు, కాగితాలు తప్ప అతను అనుకున్న వస్తువులేవి దొరకలేదు.

ప్రేలుడు పదార్థాలు సెర్చిచేసే వాళ్ళకు అందకుండా, ఏ అగాధ మౌనముద్ర మాటునో దాచుకుంటారని తెలియదు.

మా సెర్చి జరుగుతూనే ఉంది. ముసలివార్డరు పోయి, మా అందరికీ సరిపోయే గోనెలు, గొంగళ్లు, అంగీలు, లాగులు తెచ్చి సిపాయిలకు కొత్త దుస్తులిచ్చినాడు.

"మొదలు పెట్టమంటావా తాత" అన్నా.

"కానీయండి!" విందు పెద్ద భోజనానికి ఆజ్ఞయిచ్చినట్టు నిండుగా అన్నాడు తాత. ఖాకీ రంగుతో, అడ్డము నిలువు, చారలతో అవి ఆలా అంద విహీనంగానే ఉండాలంటూ కుట్టించినట్టుగా ఉన్నాయి దుస్తులు. కొత్త బనియను తొడుక్కున్నట్టు బిగువుగా ఎక్కిందిలాగు. మళ్ళీ ఊడతీసేనాడు ఎంత అవస్థ పడవలసి వస్తుందో!

అయినా ఈ ప్రభుత్వాల తలలూన్న వెధవ తల వికారం చేసి తృప్తిపడే కుళ్ళు నమ్మకలు ఎట్లా వొచ్చాయని? మళ్ళీ చదువుకున్నవాళ్ళు, వీళ్ళు చూపించేవి స్వదేశపు డిగ్రీలైనా కావు. వేలకు, వేలు కుమ్మరించి సముద్రాల అవతలినుండి తెచ్చినవి. ఖైదీలు అందంగా ఉంటే ఏమి మునుగుతుందో? ఇంతకూ, జైళ్ళను నరకకూపాలుగా లోకానికి చూపెట్టి, మళ్ళీ అయ్యో నేరాలు హత్యలు ఏమన్నా ఆపకలుగుతున్నయా ప్రభుత్వాలు! మానవుని జీవితములో పరిపూర్ణ పరిణామము వచ్చింగంటే ఈ నేరాలన్నీ తుడుచుకుపోతా యంటారు కాని అది కూడా అనుమానమే. ఎన్నటికైనా నేరస్థుని గూర్చి మనకున్న దృష్టి మారవలసిందేకాని, మానవుని ప్రకృతిలో ఉన్న ఈ గోతులు పూడటం మాత్రం అసాధ్యం. ఈ మాటలు అనుకుంటూ ఉండగా "పదండి" అన్నాడు వార్డరు, అంతా అప్పుడే ఓడ దిగి యుద్ధరంగానికి పోతూ ఉన్నట్టు బయలుదేరాము. మేము జైలు ఆవరణలో కాలుపెట్టామో లేదో, మా కొత్త ముఖాలు చూచి పని చేస్తున్న ఖైదీలంతా "బీడీపార—వేయండి దొర" అని మా వెనుకబడారు. ఎన్ని రోజులనుండో ఆకలితో మాగులుతున్న వాళ్ళు వెంటబడటం

మమ్మల్ని వెంబడించారు. కసిరివేద్దామనుకున్నా. కాని ఎందుకో నాలుక పెగలలేదు.

"ఏమీ—మిమ్మల్ని బీడీలు తాగనివ్వరూ ?"

"అవి దొరుకుతాయా దొర ?"

"ఏమీ ?"

"తెచ్చుకో నివ్వరు !"

"మరి ఎట్లా తాగుతారు ?"

"మీకు తెలియదా దొరా ? ఇంటివాళ్లు ఏమైనా యిచ్చిపోతారు. కావలి ఉన్న సిపాయిలే రహస్యంగా తెచ్చి యిస్తారు. అదైనా వాళ్ల దయ."

ఏమీ ఖైదీలు అక్రమంగా బీడీలు తెప్పించుకొని తాగుతున్నారని పైఉద్యోగులకు తెలియదా? తెలిస్తే పరిపాలనంతా క్రమంగానే జరుగుతున్నట్టు నిబ్బరం వహించి ఊరకుంటారా? ఏమీ ఆలా అక్రమంగా, అనుచితంగా వస్తున్నప్పుడు, స్వేచ్ఛగా తెచ్చుకో నిస్తేనేం? అక్కడే వస్తుంది తంటా...

చిల్లుల గుండా జల్లువస్తుంది. చక్కగా తూము పెట్టండి అంటే ప్రభుత్వాలు వినవు.

అప్పటిమటుకు పైపైన తేలిపోతుంది ఆ విషయం. కాని సాయంత్రము, జైలర్ మమ్మ చూడటానికి వచ్చినపుడు బీడీ ముక్కల కోసరం ఖైదీలు ఏవిధంగా తాపత్రయ పడతారో కళ్ళారా చూచాను. జైలర్ మాతో మాట్లాడుతూ, బీడీ త్రాగి విసిరివేసాడు. మిగిలిన తుంపు సన్నగా కాల దొడగింది. జైలరుతో వచ్చిన ఖైదీ ప్రాణాలు బిగియబట్టుకొని ఎప్పుడు "త్రాగుదునా" అన్నట్టు ఎంగిలి ముక్కవైపు చూడదొడగ్గాడు. తనకు అందక అది నిష్కారణంగా కాలిపోతూ ఉంటే అతని హృదయం కొట్టుకో దొడగింది. హృదయ తృష్ణను ఆపుకోలేక, జైలరును అక్కడినుండి ఏ విధంగా మళ్ళిద్దామా, అనే ఆలోచనలో పడ్డాడు. సన్నగా వెళ్ళుతూ ఉన్న ఆ సువాసన నాసికను చుట్టుకుంది గావును, ఏదో మతికి వచ్చి ఎగిరి పడ్డాడు. "అయ్యో, సామాను గది తెరిచివచ్చాము గదా!" అన్నాడు ఖైదీ. జైలరు తాళపుగుత్తి కోసరం జేబు తడుముకొని ఆఫీసువైపు ఉరికాడు. అతను పోవడంతోనే మేము ఉన్నామనే భీతి కూడా పడక ఆ ఎంగిలి బీడీ ముక్క అందుకొని నిండుగా తాగుతూ, తన్మయావస్థలో నడిచి పోయాడు. రాత్రి దీపం వెలిగించిన వెనుక, బుద్ధుడు, మహమ్మదు, క్రీస్తు, వీళ్లెవరికీలేని, పలుకుబడి ప్రపంచం నిండా బీడీ కెట్లా కలిగిందో, తురక హిందూ, క్రైస్తవ భేదాలతో గర్వపడకుండా, ప్రపంచాన్నంతా తన మతములోకి కూర్చుకో కలిగిన ఆ మహాశక్తి బీడీ ఎట్లా సంపాదించుకుందో, ఆలోచించడములో మునిగిపోయాను. ఎంతకూ తెమలలేదు. అయినా గుండెలన్నీ నీరుచేసే ఓ కరుణాజనక విషయం మాత్రము జ్ఞప్తికి వచ్చింది. ఏదో పత్రికలో చదివాను—ఓ జపాను కవిశేఖరుడు రాసిన కథ అది—అతను స్వయంగా యుద్ధ రంగానికి పోయి ఆ దుర్మరణాల్ని కళ్ళారా చూచాడు. నెలల తరబడిగా చీనావాళ్లకు సిగిరేట్లు అందవు. ఒకరోజు జపాను సెంట్రీ చీకట్లో తమ కందకాల వైపు ఎవరో వ్యక్తి పాకివస్తున్నట్టు చూస్తాడు. ఆ రోజు జపాను సిపాయిలకు సిగరెట్లు నిండుగా వచ్చాయి. వాళ్ళంతా కబుర్లలో ఉన్నారు. జపాను సెంట్రీ చీకటిలో తన వైపు వస్తున్న నీడను చూచి "ఆగు" అని మూడుసార్లు కేకలు వేస్తాడు. ఆ ఛాయ చీకటిలో ఒదిగి కూర్చుంది. ధామ్మున తుపాకి పేల్చాడు సైనికుడు. జపాను సైన్యాలు ఆ మనిషి పడిఉన్న వైపు ఉరికాయి. ఎంగిలి సిగిరేటు కోసరం వచ్చిన ఓ చీనా సైనికుడు సగం పీల్చిన ముక్క నోట్లో పెట్టుకొని చచ్చిపడి ఉన్నాడు. నిజంగా! సిగరెట్‌లో యింత మహాత్మ్యం ఎక్కడిది?

ఇళ్ళన్నీ కేవలం
టి. టి. ఇంగువమయం
సైన్లుపైకి
టి. టి.
మిశ్రిక యింగువ